అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు


నిత్యకల్యాణంలో యజ్ఞోపవీధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలో వేదికపై అధిష్టింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర శతనామావళి పటిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై అధిష్టింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అల్లూరికి ఘన నివాళి


అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దేవస్థానం అధికారులు, సిబ్బంది


అల్లూరి చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న సీఐటీయూ నాయకుడు గనిశెట్టి, తదితరులు

సింహాచలం: స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతిని సింహాచలం దేవస్థానం పరిపాలన కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఏఈవోలు ఎన్.ఆనంద్‌కుమార్, వి.బి.వి.రమణమూర్తి.. సీతారామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీతారామరాజు పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ రాంబాబు, సూపరింటెండెంట్ యనమండ్ర అప్పారావు, అధికారులు, సిబ్బంది, సంస్కృతోన్నత, వేద పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పరవాడ: అల్లూరి జయంతి వేడుకలను వాడచీపురుపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు గురువారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పార్వతి, కాసులమ్మ, వరలక్ష్మి, రత్నం, ధనలక్ష్మి, నూకాలమ్మ, అప్పలనరసింహం, అప్పారావు పాల్గొన్నారు.

సీఐలతో డీసీపీ సమీక్ష


సీఐలతో మాట్లాడుతున్న డీసీపీ సత్తిబాబు

మర్రిపాలెం: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు గురువారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో జోన్–2 పరిధిలోని సీఐలతో డీసీపీ మేకా సత్తిబాబు సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని, వాటిని సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. పలు కేసుల దస్త్రాలను పరిశీలించి తగు సూచనలిచ్చారు.

ముఖ్యంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలన, రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. ఆకతాయిలు శాంతి భద్రతలకు భంగం కలిగేలా ప్రవర్తించినా, అల్లర్లు సృష్టించినా వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐలు భాస్కరరావు, చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలంటూ ఆందోళన


స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

ఉక్కునగరం: ఉక్కు జనరల్ ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఉపాధ్యక్షుడు వీవీ రమణ డిమాండ్ చేశారు. ఈ అంశంపై గురువారం యూనియన్ ఆధ్వర్యంలో ఆస్పత్రి ముందు ధర్నా చేశారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో 86 మంది కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల జీతాలు చెల్లించలేదన్నారు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రిన్సిపల్ ఎంప్లాయర్‌గా యాజమాన్యమే వారికి జీతాలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో బొట్ట గంగరాజు, సోమేష్, మల్లు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

శివనగర్ యూపీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో


శివనగర్ ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మర్రిపాలెం శివనగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(యూపీహెచ్‌సీ) గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఆరోగ్య కేంద్ర సిబ్బందికి జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కోసం పలు సూచనలిచ్చారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌ను పరిశీలించి, కూలర్‌ను పరీక్షించి సూచనలు చేశారు. డీఎంహెచ్‌వో సమక్షంలోనే కొంతమంది మధుమేహం, టీబీ వ్యాధిగ్రస్తులకు వ్యాక్సిన్లు వేశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమం జిల్లాలో ఏ విధంగా జరుగుతుందో పర్యవేక్షించడానికి జిల్లా ప్రోగ్రాం అధికారులు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, నోడల్ అధికారి బి.ఉమావతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సమత వివిధ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సిబ్బందికి టీకా వేసే విధానం, వ్యాక్సిన్‌లో సిక్స్ ప్రియారిటీస్‌ను వివరించారు. లబ్ధిదారులకు వ్యాక్సినేషన్‌పై ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. యూపీహెచ్‌సీ, పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, సీ–సెక్షన్ ప్రసవాలను నివారించాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు అన్నారు. ఆరోగ్య సిబ్బంది అందరు సమయపాలన పాటించాలని, ముఖ్యంగా స్టాప్ డయేరియా కార్యక్రమం మీద ప్రజలందరికీ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వర్షా కాలంలో కీటక జనిత వ్యాధులు రాకుండా చూసుకోవాలని చెప్పారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు, పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేబిస్ టీకాల శిబిరం రేపు

విశాఖ విద్య: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ఈ నెల 6న గోపాలపట్నం ప్రాంతీయ పశు వైద్యశాలలో ఉచితంగా రేబిస్ టీకాలు వేస్తామని ఆస్పత్రి వైద్యుడు ఎ.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 89, 90, 91, 92 వార్డుల్లోని పెంపుడు కుక్కలను శనివారం ఆస్పత్రికి తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ బిల్లులు.. మారిన చెల్లింపులు

- గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే యాప్‌ల ద్వారా కరెంటు బిల్లులు చెల్లింపులు కుదరవు
- ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్..మొబైల్ యాప్ ద్వారా మాత్రమే చెల్లింపులకు అవకాశం



ఏపీఈపీడీసీఎల్ ముద్రించిన పోస్టర్

ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్
www.apeasternpower.com
మొబైల్ యాప్ : eastern power (గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి)

పెదగంట్యాడ: గతంలో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు గంటల తరబడి క్యూ లైన్లలో వినియోగదారులు వేచి ఉండాల్సి వచ్చేది..లైన్లో నిలబడలేని వారికి బిల్లులు చెల్లింపులో జాప్యం జరిగేది. దీంతో అలాంటి వారు జరిమానాలతో కలిపి బిల్లులు చెల్లించాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో మారిన సాంకేతికతకు అనుగుణంగా గూగుల్ పే.. ఫోన్ పే.. పేటీఎం, అమెజాన్ పే తదితర యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించే వెసులుబాటును విద్యుత్ సంస్థ కల్పించింది. మొదట్లో తక్కువగానే వీటి ద్వారా చెల్లింపులు జరిగినా మెల్లగా పుంజుకున్నాయి. ఈ కారణంగా అటు వినియోగదారులకు సమయం ఆదా కావడంతో పాటు క్యూ లైన్లలో నిలబడాల్సిన బాధ్యత తప్పింది.

80 శాతం ఆన్‌లైన్ చెల్లింపులే..

మండల పరిధిలో సుమారు 50 వేలకు పైగా గృహ విద్యుత్ సర్వీసులు ఉన్నాయి.. మరికొన్ని హెచ్‌డీ సర్వీసులు, పరిశ్రమల సర్వీసులు కూడా ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రతి నెలా కోట్ల రూపాయలు విద్యుత్ సంస్థకు ఆదాయం సమకూరుతోంది. 80 శాతం వరకూ వినియోగదారులు ప్రతి నెలా ఫోన్ పే, గూగుల్ పే, అమెజాన్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. 20 శాతం వరకూ విద్యుత్ కేంద్రాల వద్ద చెల్లింపులు జరుపుతున్నారు.

ఆర్‌బీఐ కొత్త నిబంధనలు

ఈ ఏడాది జూలై 1 నుంచి ఆర్‌బీఐ కొత్త నిబంధనలు తీసుకువచ్చింది. విద్యుత్ బిల్లుల చెల్లింపులను యాప్‌ల ద్వారా నిలిపి వేసింది. ఫోన్ పే, గూగుల్ పే, అమెజాన్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా చెల్లింపులు చేయడం వల్ల విద్యుత్ సంస్థకు ఆ సొమ్ము జమ కావడంలో జాప్యం కావడంతో ఇలాంటి చర్యలు తీసుకున్నట్టు తెలుస్తోంది. విద్యుత్ శాఖ రూపొందించిన యాప్ లేక వెబ్‌సైట్‌లో వినియోగదారులు తమ బిల్లులను చెల్లిస్తే నేరుగా ఆ సంస్థకు ఆ సొమ్ము జమ అయ్యేలా రూపకల్పన చేసినట్టు చెబుతున్నారు.

అవగాహన కరవు

వివిధ కారణాల వల్ల ఆర్‌బీఐ తీసుకువచ్చిన నిబంధనల కారణంగా చాలా మంది వినియోగదారులు ఇబ్బందులు పడే అవకాశాలు ఉన్నాయి. కొత్తగా విద్యుత్ శాఖ తీసుకువచ్చిన సౌకర్యంపై ఇప్పటి వరకూ వినియోగదారులకు అవగాహన లేదు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి ఈ విషయంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రజలు సహకరించాలి

ఇకపై విద్యుత్ శాఖ యాప్ లేదా వెబ్‌సైట్‌లో మాత్రమే వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించాలి. జులై 1 నుంచి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ తదితర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులను నిలిపి వేశాం. ప్రజలు ఈ విషయంలో సహకరించాలి.



–డి.శివ దుర్గాప్రసాద్, ఏఈ, పెదగంట్యాడ

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పెందుర్తి: పద్మనాభపురం స్టేషన్ బంటాకాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. బంటాకాలనీ, మేహాద్రిగెడ్డ కాలనీ, అప్పలనర్సయ్య కాలనీ, వెంకటసాయినగర్, రవినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

- గొరపల్లి ఫీడర్ పరిధిలో ఎస్ఎస్ఆర్ లేఅవుట్, రమణ లేఅవుట్, జనచైతన్య లేఅవుట్, గంగమ్మపేట, గవరపాలెం, వెల్ఫేర్ ఇంజినీరింగ్ కళాశాల, కోట్నివానిపాలెం, సంతపాలెం, గొల్లలపాలెం ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని ఈఈ తెలిపారు.

వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చేపట్టనున్న విద్యుత్ నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నామని ఏపీఈపీడీసీఎల్ కశింకోట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ తెలిపారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం, దోసూరు, దలాయిపాలెం, నునపర్తి పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

లీకేజీలతో విద్యార్థుల జీవితాలు అంధకారం

- కేంద్రం తీరుపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణం
- విద్యా సంస్థల బంద్ సందర్భంగా పీడీఎస్‌వో ప్రతినిధుల ధ్వజం



పెందుర్తి ప్రభుత్వ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న పీడీఎస్‌వో ప్రతినిధులు, విద్యార్థులు

పెందుర్తి: రాష్ట్రాల పరిధిలో జరగాల్సిన ఎంట్రన్స్ పరీక్షలను కేంద్రం తన చేతుల్లోకి తీసుకుని తరచూ లీకేజీలకు పాల్పడి దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.రుద్రి ధ్వజమెత్తారు. కేంద్రం పరిధిలో జరుగుతున్న పేపర్ల లీకేజీల వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం కనీసం నోరెత్తకపోవడం దారుణమన్నారు. నీట్, తదితర ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్ సందర్భంగా పెందుర్తిలో విద్యా సంస్థలు మద్దతు పలికాయి. పీడీఎస్‌వో ఆధ్వర్యంలో పలు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను మూయించారు. ఈ సందర్భంగా రుద్రి మాట్లాడుతూ గత ఏడేళ్లలో 15 రాష్ట్రాల్లో 70 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీకయ్యాయన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా.. వారిలో 67 మందికి 720కి 720 మార్కులు రావడం ఏంటని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా ప్రజలు దీన్ని ప్రశ్నిస్తున్నా కనీసం పార్లమెంట్‌లో చర్చించేందుకు కూడా కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం విడ్డూరమన్నారు. ఎన్‌టీఏను రద్దు చేసి రాష్ట్రాలకే ఎంట్రన్స్ పరీక్షల బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నారు. పీడీఎస్‌వో నాయకులు మధు, మహేంద్ర, శ్రీధర్, కార్తిక్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళన


ఎంపీడీవో రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

సబ్బవరం : మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో పని చేసిన వలంటీర్లకు బకాయిపడిన గౌరవ వేతనాలను వెంటనే చెల్లించాలని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం ఆందోళన చేశారు. అనంతరం ఎంపీడీవో రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రతీ ఇంటికీ ప్రభుత్వ సేవలు అందించామన్నారు. ఈ నేపథ్యంలో మండలంలో పనిచేస్తున్న 334 మంది వలంటీర్లకు మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన గౌరవ వేతనం చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని మండలాల్లోని వలంటీర్లకు గౌరవ వేతనం చెల్లించినప్పటికీ సబ్బవరం మండలంలో మాత్రమే చెల్లించకపోవడం విచారకరమన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఎంపీడీవో రామ్మోహనరావు మాట్లాడుతూ సమస్యను డీఎల్‌పీవో దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు ఆర్.అప్పలరాజు, బి.రామకృష్ణ, ఎం.జ్యోతి, జయలక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికులను 20 శాతం తగ్గించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఓ.వి. రావు డిమాండ్ చేశారు. గురువారం ఎల్ఎంఎం పార్కులో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉక్కులో ఇప్పటికే పర్మినెంట్ కార్మికులు వేలాదిమంది రిటైర్ అయినందున ఆ పని భారం కాంట్రాక్ట్ కార్మికులపై పడుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ప్లాంట్ పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కలుగ చేసుకుని కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపును అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో నమ్మి రమణ, జి. శ్రీనివాసరావు, సోమేష్, మసేను, శశిభూషన్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై కళాజాత


కళాజాతలో గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

గాజువాక: బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన కళాజాత అందర్నీ ఆకట్టుకుంది. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 66వ వార్డు అజీమాబాద్ అంగన్వాడీ కేంద్రంవద్ద గురువారం కళాజాత నిర్వహించారు. కిశోర బాలికలు, బాలింతలు, గర్భిణులు, మహిళలకు బాల్య వివాహాలవల్ల తలెత్తే ఇబ్బందులను కళాకారులు ఆట, పాటలద్వారా వివరించారు. బాలల హక్కులు, చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారం తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్రవంతి, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.కె.మునీరా బేగం, ఎంఎస్ఏకె ప్రవీణ, కళాజాత సభ్యులు, డ్వాక్రా మహిళలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కమనీయం శ్రీకృష్ణ లీలలు నాటకం


శ్రీకృష్ణ లీలలు నాటకంలో సన్నివేశం

మద్దిలపాలెం : సురభి శ్రీకృష్ణ లీలలు నాటకం ప్రతి సన్నివేశం ఎంతో అద్భుతంగా సాగింది. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఐదో రోజు శ్రీకృష్ణలీలలు నాటకాన్ని ప్రదర్శించారు. కథానుగుణంగా పాత్రదారులు వారి నటనతో అందరి అలరించారు. సన్నివేశాలకు తగ్గట్టుగా పద్యాలు ఆలాపించి ఆకట్టుకున్నారు.

ఆద్యంతం నాటకం కమనీయంగా సాగింది. ఈ కార్యక్రమానికి విశ్రాంత లేబర్ కమిషనర్ డీఆర్‌కే రావు, హైకోర్టు న్యాయవాది కేఆర్ రావు, బడే ప్రభాకర్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రంగసాయి నాటక సంఘం వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి నేతృత్వంలో ప్రదర్శించారు. నాటకం సినిమాను తలపించేలా ఉందని ప్రేక్షకులు ప్రశంసలు కురిపించారు.

క్లుప్తంగా

వెంకన్న హుండీ ఆదాయం రూ.5.20 లక్షలు


హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 90 రోజులకు రూ.5,20,922 ఆదాయం వచ్చినట్లు పర్యవేక్షణాధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ముందుగా వెంకన్నకు నిత్య పూజలు చేశారు. ఈవో నీలిమ, ఆలయ ప్రధానార్చకుడు మహర్షి రామానుజాచార్యులు, భక్తులు, వెంకన్న సేవలు పాల్గొన్నారు.

ఘనంగా వంగవీటి రంగా జయంతి


రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న పాశర్ల ప్రసాద్, తదితరులు

సింహాచలం : వంగవీటి మోహన రంగా జయంతిని గురువారం అడవివరంలో ఘనంగా నిర్వహించారు. పాత గోశాల వద్ద ఉన్న రంగా విగ్రహానికి అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీ వరహాదేవరాయ తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు ఎర్ని భాస్కరరావు, నాయకులు భోగాపురపు పైడికొండ, సందక పైడినాయుడు, నామాన కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలి

పరవాడ : దేవాలయం కేంద్రంగా ధార్మిక జట్టు సహకారంతో ఏకాదశి, పౌర్ణమి కార్యక్రమాలు నిర్వహించాలని మండల కన్వీనర్ మల్లిమడుగుల నాగపేర్రాజు అన్నారు. వెన్నలపాలెం కూడలిలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం కేంద్రంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ రెండు మూడు దేవాలయాల బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతీ నెలా 1 నుంచి 5 వరకు మండల సమావేశాలు, 10 నుంచి 25 వరకు ధార్మిక జట్టు సమావేశాలు దేవాలయాల కేంద్రంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ నెలలో ఆత్మీయ బంధువులను కలవడం, పెళ్లి, పుట్టిన రోజు కార్యక్రమాలు దేవాలయాలు కేంద్రంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి, బొద్దపు నూకరత్నం, ఎం.హరిబాబు, వానపల్లి అప్పలరాజు, ఎం.వీరునాయుడు, అయ్యబాబు, గంగరాజు, సన్యాసిరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం


వృద్ధురాలితో మమత

విశాఖ విద్య: అనాథ వృద్ధురాలికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ప్రత్యేక చొరవ తీసుకొని ఆశ్రయం కల్పించారు. కంచరపాలెం ట్రైన్ వాష్ ఏరియాలో వృద్ధురాలు కొంతకాలంగా మెట్ల కిందనే ఉంటూ జీవనం సాగిస్తోందని సమాచారం తెలుసుకున్న జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అక్కడికి వెళ్లి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. మతిస్థిమితం లేకపోవడంతో వివరాలు చెప్పలేదు. ఆ వృద్ధురాలికి భాష కూడా సరిగా రాకపోవడంతో ఆదర్శనగర్‌లోని మన కుటుంబం వృద్ధాశ్రమానికి గురువారం తరలించి సేవలు అందించారు.

ఏయూకు పుస్తకాల బహూకరణ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంథాలయానికి ఆస్ట్రేలియా తొలితరం రచయిత, విశ్రాంత మైనింగ్ ఇంజినీర్ వి.ఎస్.ఉటుకూరి రచించిన తెలుగు పాటలకు సంబంధించిన పరిశోధనాత్మక పుస్తకాలను ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబుకు అందించారు. గురువారం రిజిస్ట్రార్‌ను కార్యాలయంలో శ్రీధర్ కరుణాకర్, ఆస్ట్రేలియా వర్సిటీ గణిత అధ్యాపకురాలు ప్రవాస రచయిత్రి ఉషాశ్రీ దేవి, ఏయూ తెలుగు ఆచార్యులు అయ్యగారి సీతారత్నం కలిసి ఈ పుస్తకాలను బహూకరించారు.

విరివిగా మొక్కలు పెంచాలి


ఆటోనగర్ ఏఈపీ - బ్లాక్‌లో మొక్కలు నాటుతున్న ఐలా చైర్మన్ రఘు, ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మొక్కలను విరివిగా పెంచాలని ఆటోనగర్ ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు), కార్యదర్శి దీకటి సత్యనారాయణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ముగింపు వేడుకలు ఆటోనగర్ ఏఈపీ – బ్లాక్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఐలా, వాసీవా ప్రతినిధులు, ఎంఎస్ఎంఈ అధికారులు, పారిశ్రామికవేత్తల చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐలా ప్రతినిధులు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌లో జూన్ 5వ తేదీ నుంచి జూలై 4వ తేదీ వరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవాలను ఘనంగా నిర్వహించామన్నారు. పలు బ్లాక్‌లలో వందలాది మొక్కలు నాటామన్నారు. కాలుష్య రహిత ప్రాంతంగా పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్‌ను తీర్చి దిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో ఐలా వైస్ చైర్మన్ కొల్లి ఈశ్వరరావు, కోశాధికారి కె.పద్మావతి, సభ్యులు విశాలక్ష్మి, జె.కె.కోటేశ్వరరావు, వాసీవా ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, ప్రభాకర్ కుమార్, ఐలా మాజీ చైర్మన్లు శేషగిరిరావు, కొల్లి సత్యనారాయణ, వై.సాంబశివరావు, పారిశ్రామిక వేత్తలు కృష్ణ ప్రసాద్, హార్మోని బాలాజీ, ఫిట్టర్ రెడ్డి, రవి ఫ్యాబ్రికేటర్స్ పాల్గొన్నారు.